సాక్షి
పార్వతీపురం మన్యం

శుక్రవారం । 11 । ఆగస్టు । 2023



చెప్పడానికి ఏమీలేక..!

చెప్పేందుకు చేసిన అభివృద్ధి పనులు ఏమీ లేక చంద్రబాబు లేనిపోని విమర్శలు చేస్తున్నారని జెడ్పీ చైర్మన్ ఆరోపించారు. - 8లో



శాంతి ర్యాలీ

మణిపూర్‌లో మారణహోమాన్ని నిరసిస్తూ ఎస్సీ, ఎస్టీ, క్రిస్టియన్, ముస్లిం మైనార్టీల ఫోరం విజయనగరం శాంతి ర్యాలీ నిర్వహించింది. - 8లో

నేడు జిల్లాకు ఆహార కమిషన్ సభ్యుల రాక

పార్వతీపురం: రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు జిల్లాలో శుక్రవారం పర్యటిస్తారని జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆహార కమిషన్ సభ్యులు ఇ.లక్ష్మీరెడ్డి, జి.దేవి జిల్లాలో పర్యటించనున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సంబంధిత జిల్లా అధికారులతో సమావేశం, క్షేత్ర స్థాయిలో పర్యటన ఉంటుందని వివరించారు.

న్యూస్‌రీల్

డైట్‌సెట్ విద్యార్థులకు మరో అవకాశం

నెల్లిమర్ల రూరల్: డైట్ సెట్–2023 పరీక్షలో అర్హత సాధించి సీటురాని విద్యార్థులకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందని నెల్లిమర్ల ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతినాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏ కళాశాలలో సీటు పొందని అభ్యర్థులు, వేరే కళాశాలలకు వెళ్లాల్సిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ నెల 11 నుంచి 13వ తేదీలోపు సీటు కావాల్సిన కళాశాలను ఆన్‌లైన్‌లో ఎంపిక చేసుకోవాలన్నారు. 14 నుంచి 16వ తేదీ వరకు సీట్లు కేటాయిస్తామని, 17 నుంచి 20వ తేదీ వరకు ఎంపిక ఉత్తర్వుల ప్రక్రియ, ధ్రువపత్రాల పరిశీలన ఉంటాయన్నారు.

జాతీయ జెండా బహుకరణ



జాతీయజెండాను కలెక్టర్‌కు బహూకరిస్తున్న పోస్టల్ సూపరింటెండెంట్

పార్వతీపురం: ఆజాది కా అమృత్ మహోత్సవంలో భాగంగా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ నిషాంత్‌కుమార్‌కు పోస్టల్ సూపరింటెండెంట్ ప్రిన్స్ కుమార్ సిద్దార్థ్ జాతీయజెండాను గురువారం బహూకరించారు. హర్ ఘర్ తిరంగ కార్యక్రమంపై ప్రచారం చేస్తూ జెండాలను అందజేశారు.

పక్కాగా మెనూ అమలు



మాట్లాడుతున్న పీఓ కల్పనాకుమారి

సీతంపేట: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో మెనూ పక్కాగా అమలు చేయాలని ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి ఆదేశించారు. సీతంపేట ఐటీడీఏలో హెచ్‌ఎంలతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. విద్యాప్రగతిపై దృష్టిసారించాలన్నారు. బోధన ప్రణాళికను సమర్థంగా అమలు చేయాలని సూచించారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. స్వాతంత్య్ర దినోత్సవాన్ని సంబరంగా నిర్వహించాలని, విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేయాలన్నారు. వేడుకలకు హాజరయ్యే విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ రోసిరెడ్డి, డీడీ శ్రీనివాసరావు, డిప్యూటీఈఓ లిల్లీరాణి, ఏటీడబ్ల్యూఓలు మంగవేణి, కృష్ణవేణి, స్పోర్ట్స్ ఇన్‌చార్జి జాకబ్ దయానంద్, గురుకులంసెల్ ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ దేశ్ పాల్గొన్నారు.

పనుకువలస సర్పంచ్ ఏకగ్రీవం



పనుకువలస సర్పంచ్ స్థానానికి నామినేషన్ దాఖలు చేస్తున్న కోట మంజుభార్గవి

పాలకొండ రూరల్: మండలంలోని పనుకువలస పంచాయతీ సర్పంచ్ (జనరల్ ఆల్) స్థానానికి నిర్వహించిన ఉప ఎన్నికలో ఒకే నామినేషన్ దాఖలు కావడంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. శుక్రవారం నామినేషన్ పరిశీలన అనంతరం సర్పంచ్ అభ్యర్థి మంజుభార్గవికి డిక్లరేషన్ అందించనున్నట్టు ఎన్నికల రిటర్నింగ్ స్టేజ్–1 అధికారి ప్రవళిక తెలిపారు. ఆమెను బలపర్చిన ఎంపీటీసీ సభ్యుడు కోట అజేయ్ బాబు మాట్లాడుతూ ఇటీవల అనారోగ్యంతో మరణించిన పూర్వపు సర్పంచ్ కోటముఖుంద నాయుడుపై ఉన్న అభిమానంతో ఆయన కుటుంబ సభ్యురాలైన మంజుభార్గవికి గ్రామస్తులు, మాజీ ప్రజా ప్రతినిధులు పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా సర్పంచ్‌గా ఏకగ్రీవంగా అవకాశం కల్పించారన్నారు. అన్నవరం పంచాయతీ వార్డు 8 (ఎస్సీ ఆల్) స్థానానికి దాగోలు చంద్రశేఖర్ ఒక్కరే నామినేషన్ వేశారు. అలాగే, వీపీ రాజుపేట పంచాయతీ పరిధిలో ఒకటో వార్డు (బీసీ జనరల్) స్థానానికి కాసపు లక్ష్మీనారాయణ ఒక్కరే నామినేషన్ దాఖలు చేయగా, ఇదే పంచాయతీలో 7వ వార్డు (ఎస్సీ జనరల్) స్థానానికి బి.శంకరరావు, బి.శాంతమ్మ నామినేషన్లు వేసినట్టు రిటర్నింగ్ స్టేజ్–1 అధికారి కె.సోంబాబు తెలిపారు.

చీపురుపల్లి రైల్వేస్టేషన్‌ను పరిశీలించిన డీఆర్‌ఎం

చీపురుపల్లి: స్థానిక రైల్వేస్టేషన్‌ను వాల్తేరు డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరవ్‌ప్రసాద్ గురువారం పరిశీలించారు. స్టేషన్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డీఆర్‌ఎంకు విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ తనయుడు వంశీకృష్ణ విజ్ఞప్తి చేశారు. ఆయన ఆరోబీ పనులు పరిశీలించారు.

ఉత్తమ విద్యాలయంగా

రేగులపాడు కేజీబీవీ

- స్టేట్ బెస్ట్ స్కూల్ అవార్డుకు ఎంపికపై కేజీబీవీ సిబ్బంది హర్షం
- అభినందించిన జిల్లా అధికారులు
- ఈ నెల 15న ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు ప్రదానం

వీరఘట్టం:

విద్యార్థుల హాజరుసమోదు.. పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధన.. విద్యాలక్ష్యాలు చేరుకోవడంతో వీరఘట్టం మండలం రేగులపాడు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)కు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు లభించింది. ఉత్తమ విద్యాలయంగా ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ అధికారుల నుంచి కేజీబీవీ అధికారులకు గురువారం సమాచారం అందింది. రాష్ట్రంలో ఉన్న 352 కేజీబీవీలలో రేగులపాడు కేజీబీవీ ఉత్తమమైనదిగా రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేయడంపై సిబ్బంది, బాలికలు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సిబ్బంది పనితీరును డీఈఓ ఎస్.ప్రేమ్‌కుమార్, జీసీడీఓ రోజారమణి ప్రశంసించారు. కేజీబీవీ ఎస్‌ఓ రోహిణికి ఫోన్‌చేసి అభినందనలు తెలిపారు. ఆగస్టు 15న విజయవాడలో జరగనున్న స్వాతంత్య్ర దినోత్సవంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డును ప్రదానం చేయనున్నారు.



రాష్ట్రస్థాయి ఉత్తమ విద్యాలయంగా ఎంపికైన వీరఘట్టం మండలం రేగులపాడు కేజీబీవీ

అంచెలంచెలుగా...

వీరఘట్టం మండల కేంద్రంలో 2011 సెప్టెంబర్ 2వ తేదీన కేజీబీవీను ప్రారంభించారు. మొదటి రెండేళ్లు 6, 7, 8 తరగతులను నిర్వహించారు. 2013 నుంచి 6 నుంచి 10వ తరగతి వరకు విద్యాబోధన చేపట్టారు. నాలుగేళ్ల పాటు వీరఘట్టంలోని ఓ ప్రవేటు భవనంలో కొనసాగిన కేజీబీవీ, తర్వాత రేగులపాడు వద్ద నిర్మించిన భవనంలోకి మార్చారు. 13 మంది బాలికలతో ప్రారంభమైన కేజీబీవీలో నేడు 222 మంది విద్యనభ్యసిస్తున్నారు. వీరిలో 6–10 తరగతి బాలికలు 197 మంది, ఇంటర్మీడియట్ ఫస్టియర్ బాలికలు 18 మంది, సెకెండియర్ బాలికలు ఏడుగురు ఉన్నారు. వీరందరికీ ప్రభుత్వం కార్పొరేటు స్థాయిలో సకల సౌకర్యాలు కల్పిస్తుండడంతో రేగులపాడు కేజీబీవీలో సీటుకు తీవ్ర పోటీ నెలకొంది.

పదో తరగతిలో శతశాతం ఫలితాలు

ఏటా పదో తరగతిలో శతశాతం ఫలితాలే నేడు కేజీబీవీని రాష్ట్ర స్థాయిలో ఉత్తమంగా నిలిపాయి. పదో తరగతి ఫలితాల్లో అధికమంది అత్యధిక మార్కులు సాధించడం, ప్రతీ తరగతిలో గరిష్ఠంగా బాలికలు చేరడంతో పాటు హాజరుశాతం మెరుగ్గా ఉండడంతో ఈ ఏడాది బెస్ట్ కేజీబీవీగా రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఎంపిక చేశారు.

ఉత్తీర్ణత శాతం ఇలా...

తొలిసారి 2013లో పదోతరగతి పరీక్షలు రాసిన 13 మంది బాలికలు ఉత్తీర్ణులయ్యారు. 2013 నుంచి 2016 వరకు శతశాతం ఫలితాలు సాధించారు. 2017లో 97 శాతం, 2018లో 93 శాతం, 2019లో 96 శాతం ఫలితాలు నమోదయ్యాయి. 2020 నుంచి 2023 వరకు శతశాతం ఉత్తీర్ణత సాధించారు. 2023లో 33 మంది బాలికలు పదోతరగతి పరీక్షలు రాయగా అందరూ ఫస్ట్ క్లాస్‌లో పాసయ్యారు. 2022–23లో ప్రారంభించిన ఇంటర్మీడియట్ విద్య మొదటి బ్యాచ్‌లో చేరిన ఏడుగురూ ఉత్తీర్ణులయ్యారు.

ప్రత్యేక గుర్తింపు



రేగులపాడు కేజీబీవీకి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు లభించింది. చక్కని విద్యాబోధనతో శతశాతం ఫలితాలు నమోదవుతున్నాయి. బాలికల ఉజ్వల భవితకు గట్టి పునాది వేస్తున్నారు. చిన్నచిన్న లోటుపాట్లతో గతంలో ఉన్నత విద్యాశాఖ అధికారుల ఆగ్రహానికి గురైనా... బోధనలో రాజీపడకుండా ముందుకు సాగుతున్న సిబ్బందికి అభినందనలు.

– రోజారమణి, జీసీడీఓ, పార్వతీపురం మన్యం జిల్లా

సంతోషంగా ఉంది



రాష్ట్రంలో ఉన్న 352 కేజీబీవీల్లో ఉత్తమ విద్యాలయంగా రేగులపాడు కేజీబీవీ ఎంపిక కావడం సంతోషంగా ఉంది. టీచర్ల సమష్టి కృషితో ఉత్తమ ఫలితాలు నమోదవుతున్నాయి. ఇక్కడ చేరిన బాలికలు క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తారు. అందుకే శతశాతం ఫలితాలు సాధించగలుగుతున్నాం. ప్రభుత్వం కేజీబీవీకి కావాల్సిన సదుపాయాలన్నీ కల్పించింది. ఆహ్లాదకర వాతావరణంలో విద్యాబోధన సాగుతోంది. ఉన్నత విద్యాశాఖ అధికారులు గుర్తించిన చిన్నచిన్నలోటుపాట్లను సరిచేస్తూ చక్కని విద్యాప్రణాళికను అమలు చేస్తున్నాం.

– రోహిణి, కేజీబీవీ ఎస్‌ఓ

వెలవెలబోయిన చంద్రబాబు పర్యటన

- టీడీపీ శ్రేణుల్లో నైరాశ్యం
- వర్గపోరు తేటతెల్లం
- ఎవరి ఫ్లెక్సీలు వారివే..



వీరఘట్టంలో చేపట్టిన రోడ్డు షోలో మాట్లాడుతున్న చంద్రబాబు

పాలకొండ రూరల్/పాలకొండ/వీరఘట్టం:

పాలకొండ నియోజకవర్గం మీదుగా గురువారం సాగిన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు రోడ్‌షోకు జనస్పందన కరువైంది. పార్టీలోని రెండు వర్గాలు ఎవరికివారే యమునా తీరే అన్న రీతిలో సాగాయి. ఫ్లెక్సీల నుంచి రోడ్‌షోలో పాల్గొనేవరకు దూరం పాటించాయి. తొలి నుంచి నియోజకవర్గ ఇన్‌చార్జి నిమ్మక జయకృష్ణను వ్యతిరేకిస్తున్న ఓ వర్గం నాయకులు అటు మండలంలో బాబు కాన్వాయ్ ప్రవేశించిన నవగాంలో, పట్టణంలోని వైఎస్సార్ కూడలి వద్ద కనిపింత లేదు. పాలకొండలో తన ఓపెన్‌టాప్ వాహనం నుంచి ప్రజలకు అభివాదం చేసిన బాబు తను అధికారంలోకి వస్తే నియోజకవర్గానికి ఏమి చేస్తామన్నది చెప్పకపోవడం, ప్రసంగమంతా చప్పగా, పొరుగు రాష్ట్రాల మ్యానిఫెస్టోను చదవడానికే పరిమితం కావడంతో టీడీపీ శ్రేణుల్లో నిరాసక్తత కనిపించింది. కనీసం తమ పార్టీ అభ్యర్థి పేరును ఎక్కడా ప్రస్తావించకపోవడంతో రెండుసార్లు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విశ్వాసరాయి కళావతి చేతిలో ఓడిపోయిన జయకృష్ణ వర్గంలో నైరాశ్యం అలముకుంది. గెలుపోటములు పక్కనపెడితే కనీసం అభ్యర్థి పేరు ఖరారు చేయకపోవడం చర్చకు దారితీసింది. చంద్రబాబు కాన్వాయ్ వెంట సాగినా... కనీసం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జయకృష్ణ పేరు ఎక్కడా ప్రస్తావించకపోవడంతో ఈ సారి టిక్కెట్ ఇవ్వరంటూ వ్యతిరేకవర్గం ప్రచారానికి తెరతీసింది. వైఎస్సార్ కూడలి నుంచి కోటదుర్గమ్మ దేవస్థానం, ఆర్టీసీ కాంప్లెక్స్, యాలాం కూడలి వద్ద కూడా జనాలు లేకపోవడంతో వాహనశ్రేణి కొండాపురం మీదుగా శ్రీకాకుళం జిల్లాలోకి ప్రవేశించింది. పాలకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి వ్యతిరేక వర్గం స్థానికంగా కనిపించకపోయినా జిల్లా దాటి శ్రీకాకుళంలో పరిధిలో చంద్రబాబు వెంట వెళ్లింది. నరుబుజ్జిలి, కొత్తూరు, గొట్టా బ్యారేజీ సందర్శనల్లో చురుగ్గా పాల్గొనడం గమనార్హం.

ఫ్లెక్సీల గోల....

పాలకొండ నియోజకవర్గంలోని టీడీపీలో వర్గపోరు తారాస్థాయికి చేరుకుంది. టీడీపీ అధినేత చంద్రబాబుకు స్వాగతం పలుకుతూ నిమ్మక జయకృష్ణ, పడాల భూదేవికి చెందిన వర్గాల వారు వేర్వేరుగా వీరఘట్టంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. పలుచోట్ల భూదేవి కట్టిన ఫ్లెక్సీలను గుర్తుతెలియని వ్యక్తులు చించివేశారు. జయకృష్ణ వర్గం వారే తమ ఫ్లెక్సీలను చించివేశారని సోషల్ మీడియాలో భూదేవి వర్గం ముమ్మర ప్రచారం చేసింది. చిల్లర రాజకీయాలతో జయకృష్ణ ఎన్నటికీ రాణించలేడని ఆ వర్గం వారు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.

పీఆర్‌సీ చర్చలు సఫలం



ఎస్‌ఈకి మిఠాయి తినిపిస్తున్న ప్రసాదరావు

విజయనగరం ఫోర్ట్: విద్యుత్ ఉద్యోగుల సంఘం పీఆర్‌సీపై ప్రభుత్వంతో జరిపిన చర్చలు సఫలం కావడంపై వైఎస్సార్ విద్యుత్ ఉద్యోగుల సంఘం నాయకులు హర్షం వ్యక్తంచేశారు. దాసన్నపేట విద్యుత్ భవన్‌లో ఉద్యోగులు గురువారం మిఠాయిలు పంచిపెట్టారు. మేనేజ్‌మెంట్‌కూ కార్మిక సంఘాలకూ జరిగిన ఒప్పందంలో 8 శాతం ఫిట్‌మెంట్ 2,60,000 పర్సనల్‌పేగా నిర్ణయించడంతో పాటు కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు కూడా 2018 పేకు 2శాతం ఫిట్‌మెంట్ అమలుచేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఈ ముప్పల లక్ష్మణరావు పాల్గొన్నారు.

దళితులంటే

చంద్రబాబుకు చిన్నచూపు

- దళిత ఎమ్మెల్యేననే పనిగట్టుకొని అసత్య ఆరోపణలు
- టీడీపీ నాయకుల బాగోతాలన్నీ బాబుకు తెలుసు
- ప్రాజెక్టుల సందర్శన పేరిట అసత్య ప్రచారాలు
- గత 14 ఏళ్ల పాలనలో పార్వతీపురం ప్రాంతానికి చేసిందేమీలేదు
- ఇప్పుడు తాగునీటి పథకానికి లిఫ్ట్ ఇరిగేషన్ తెస్తానంటూ మాయమాటలు
- పార్వతీపురం మన్యం జిల్లా తెచ్చింది, ప్రజల ఆకాంక్షలు నెరవేర్చుతున్నదీ వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డే
- మీడియా సమావేశంలో పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

దళితులన్నా, దళిత నాయకులన్నా చంద్రబాబు సహా టీడీపీ నాయకులకు ఎంత చిన్నచూపో మరోసారి రుజువైంది. ప్రాజెక్టులు విధ్వంసం జరిగిపోయిందంటూ తోటపల్లికి వచ్చిన చంద్రబాబు... ఈ ప్రాంతానికి తాను చేసిందేమిటో చెప్పుకోలేకపోయారు. తోటపల్లికి ప్రాజెక్టుకు 2004 సార్వత్రిక ఎన్నికలకు కొద్ది రోజుల ముందు శంకుస్థాపన చేయడం మినహా ఏమీ లేదని, చెప్పుకోవడానికి ఏమీ లేక దళిత ఎమ్మెల్యేనైన తనపై పనిగట్టుకొని చంద్రబాబు అసత్య ఆరోపణలతో ఆత్మసంతృప్తి చేసుకున్నారని పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు విమర్శించారు. పార్వతీపురంలోని తన కార్యాలయంలో మీడియాతో గురువారం మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...

వైఎస్ కుటుంబానికి రుణపడి ఉన్నాం...

మూడు జిల్లాల రైతులకు సాగునీరు అందిస్తున్న తోటపల్లి ప్రాజెక్టును సాకారం చేసిన ఘనత వై.ఎస్.కుటుంబానిదే. ఈ ప్రాంత రైతులమంతా వారికే రుణపడి ఉంటాం. ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేసింది నాటి ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి. ఇప్పుడు డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ నిర్మాణానికి నిధులిచ్చింది నేటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి. ఆ సంధికాలంలో టెంకాయ కొట్టి శిలాఫలకం మీద పేరు వేసుకోవడం తప్ప చంద్రబాబు చేసిందేమీ లేదు. ఇప్పుడొచ్చి సిగ్గులేకుండా సెల్ఫీ తీసుకుంటున్నారు. పైసా చేసిందేమీ లేకపోయినా తన ఖాతాలో వేసుకోవడానికి చంద్రబాబు తాపత్రయం హాస్యాస్పదం.



పార్వతీపురం నియోజకవర్గ అభివృద్ధి పనులపై ముద్రించిన పుస్తకాన్ని చూపిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

అభివృద్ధి ప్రదాత జగన్...

దశాబ్దాలుగా వెనుకబడిన ఈ ప్రాంతానికి అభివృద్ధి ప్రదాత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి. పార్వతీపురం మన్యం కొత్త జిల్లాను ఏర్పాటు చేసి ప్రగతి బాటలు వేశారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చారు. కొత్త జిల్లాలో ఇన్నాళ్లకు అడుగుపెట్టిన చంద్రబాబు... ఈ ప్రాంతానికి కొత్తగా ఏం చేయదలచుకున్నారో అదైనా చెప్పాలి. అలాగాకుండా తన 14 ఏళ్లలో ఏనాడూ పట్టించుకోని సమస్యలను ఇప్పుడు చేస్తానని మళ్లీ మాయమాటలు చెబుతున్నారు.

నిరూపిస్తే రాజకీయ సన్యాసం

చంద్రబాబు ఒక దళిత ఎమ్మెల్యేనైన నాపై ఆరోపణలు చేశారు. పార్వతీపురం నియోజకవర్గంలో ఒక్క చెరువు ఆక్రమణగానీ, ఒక్క ప్రభుత్వ స్థలంగానీ, ఏ ప్రైవేటు స్థలమైనా సరే నా పేరున, నా కుటుంబసభ్యులు, బంధువుల పేరున్న ఉన్నట్లు నిరూపిస్తే రాజకీయ సన్యాసం చేస్తా. ప్రాణత్యాగం చేయడానికైనా సిద్ధమే. మీ టీడీపీ నాయకుల్లా దోచుకోవడం, దాచుకోవడం మా పనికాదు. అవన్నీ చంద్రబాబుకు తెలియనికాదు. మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్‌కు పట్టణ పడిబొడ్డులో కబ్జాచేసి ఇల్లు కట్టుకోలేదా? కొమరాడ మండలంలో సుమారు 180 ఎకరాలు ఓ డాక్టర్ భూమిని కబ్జా చేసింది జగదీష్, ఆయన సోదరుడు కాదా? గరుగుబిల్లి మండలం శివ్వాం గ్రామంలో ప్రభుత్వ భూములను, ఇనాం భూములను ఆక్రమించి పట్టాలు సృష్టిస్తే... సీబీసీఐడీ విచారణలో ఉన్నది మీరు కాదా? టీడీపీ పార్వతీపురం పట్టణ అధ్యక్షుడు జగన్నాథపురం గ్రామంలో 6 ఎకరాల స్థలాన్ని, చెరువుని కబ్జా చేసి అందులో ఇటుక పరిశ్రమ పెట్టి వేరే వ్యక్తులకు లీజుకు ఇవ్వలేదా? తిరుపతి వెంకన్న దర్శనం సిఫారసు లేఖలనూ అమ్ముకోలేదా? వ్యాపారులను వేధించినది నిజం కాదా? వీటన్నింటిపై నేను చర్చకు సిద్ధం."

తాగునీటి సమస్య తీర్చిందెవరు?

పార్వతీపురం నియోజకవర్గ కేంద్రంలో తాగునీటి సమస్య తీర్చడానికి పైప్‌లైన్ వేస్తానని చెప్పకుండా లిఫ్ట్ ఇరిగేషన్ చేస్తానని చంద్రబాబు చెబుతున్నారంటే ఆయన ఆలోచన విధానం ఎంత అస్తవ్యస్తంగా ఉంటుందో అర్థమవుతోంది. ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో ప్రజలకు మరోసారి తెలిసింది. రూ.57 కోట్లు మంజూరు చేశామని గొప్పలు చెప్పకుంటున్నారు. చంద్రబాబు ఎప్పుడు జీవో ఇచ్చారు? శంకుస్థాపనైనా చేశారా? ఏవీ లేవు. తాగునీటి సమస్యను పరిష్కరించడానికి నడుంబిగించింది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ఆయన ప్రభుత్వం రూ.63.63 కోట్లు మంజూరు చేసింది. సుమారుగా రూ.3 కోట్ల విలువైన పైపులు పైప్‌లైన్ పనుల కోసం తెప్పించాం. త్వరలోనే పార్వతీపురం పట్టణానికి తాగునీరు అందిస్తామని కచ్చితంగా చెప్పగలం.

చంద్రబాబువన్నీ అబద్ధాలే...

మళ్లీ ఆశీర్వదిస్తే జంఝావతి ప్రాజెక్టు నిర్మాణం చేస్తానని చంద్రబాబు అబద్ధాలు చెబుతున్నారు. గతంలో అశోక్ గజపతిరాజుతో కలిసి ఒడిశా పర్యటనకు వెళ్లి ఏం చేశారు? బలిజిపేట మండలంలో రెసిడెన్షియల్ స్కూల్ ఎక్కడ ఏర్పాటు చేశారో వారే చూపించాలి. దశాబ్దాల సమస్యగానున్న సీతానగరం మండలం గెడ్డలుప్పి వద్ద సువర్ణముఖి నదిపై రూ.13 కోట్లతో వంతెన నిర్మాణం చేశామని చెబుతున్నారు. చంద్రబాబు పాలనలో కనీసం ఒక్క స్తంభం కూడా వేయలేదు. పార్వతీపురంలో రూ.25కోట్ల రైల్వే ఫ్లైఓవర్‌ను నిర్మించామని గొప్పగా చెప్పుకుంటున్నారు. కనీసం లైట్లు కూడా వేయకుండా వదిలేసిన విషయం ఆయనకు గుర్తు లేదు. మా ప్రభుత్వం వచ్చిన తరువాతే దానికి కనెక్టివిటీ ఉన్న బైపాస్‌రోడ్డును నిర్మించాం. దానిపై లైట్లు కూడా మేమే వేశాం.

సిగ్గు లేకుండా సెల్ఫీ...

తోటపల్లి ప్రాజెక్టు వద్ద సెల్ఫీ తీసుకోవడానికి సిగ్గు ఉండాలి. 2003లో ఆ ప్రాజెక్టుకు రూ.1,650 కోట్లు ఎక్కడ ఖర్చుపెట్టావు? ఎన్నికలకు ముందు హడావుడి శంకుస్థాపన రాయి వేయడం తప్ప ఒక్క పైసా ఇవ్వలేదు. 2014–19 పాలనలో తోటపల్లి బ్రాంచ్ కెనాల్‌కి ఒక్క పైసా కూడా ఖర్చుపెట్టలేదన్న విషయాన్ని మర్చిపోయావా చంద్రబాబూ? జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో తోటపల్లి బ్రాంచ్ కెనాల్‌కి రూ.50 కోట్లతో భూసేకరణ పూర్తి చేశారు. మరో రూ.58 కోట్లను బ్రాంచ్ కెనాల్ నిర్మాణం చేపట్టారు. ఒక్క పార్వతీపురం నియోజకవర్గంలోనే 20 వేల ఎకరాలకు పైగా అదనపు ఆయకట్టుకు సాగునీరు అందించాం.

వాటి ఊసెత్తవద్దు బాబూ...

టిడ్కో ఇళ్ల గురించి మాట్లాడే అర్హత చంద్రబాబుకు లేదు. వాటికి స్థల పరిశీలన పేరుతో పేద దళితుల స్థలాన్ని లాక్కున్నారు. కానీ భవన నిర్మాణానికి ఒక్క రూపాయి కూడా వెచ్చించలేదు. మా జగనన్న ప్రభుత్వ హయాంలో 882 ఇళ్లు నిర్మించాం. త్వరలోనే ప్రజలకు ఉచితంగా అందిస్తాం. పార్వతీపురం ఎస్వీడీ కళాశాలను ప్రభుత్వ డిగ్రీ కళాశాలగా మార్చు చేశాం.

బైపాస్ రోడ్డు, బొబ్బిలి నుంచి పార్వతీపురం వరకు రహదారి, నారాయణపురం బ్రిడ్జి వంటివే గాకుండా వంద వరకూ బీటీ రోడ్లు పార్వతీపురం నియోజకవర్గంలో చేశాం.

ఆరోగ్యానికి జగన్ భరోసా...

సీజనల్ వ్యాధులతోనే, అత్యవసర వైద్యం అందక ఇబ్బందిపడుతున్న మా ప్రాంతవాసులను చంద్రబాబు పాలనలో ఎప్పుడూ పట్టించుకోలేదు. పార్వతీపురం జిల్లా ఆస్పత్రిని 150 పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేస్తామని జీఓ ఇచ్చి ఊరుకున్నారు. వాస్తవానికి ఈ ప్రాంత ప్రజల ఆరోగ్యానికి భరోసా ఇస్తున్నది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే. పార్వతీపురం జిల్లా ఆస్పత్రిని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా చేశారు. ఈ ప్రాంతానికి ప్రభుత్వ మెడికల్ కాలేజీని మంజూరు చేశారు.

నులిపురుగుల నిర్మూలనతో ఆరోగ్యం

- కలెక్టర్ నిషాంత్ కుమార్



విద్యార్థినితో ఆల్బెండజోల్ మాత్ర మింగిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురంటౌన్: నులిపురుగుల నిర్మూలనతో ఆరోగ్యం సమకూరుతుందని, పిల్లందరూ ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని కలెక్టర్ నిషాంత్ కుమార్ పిలుపునిచ్చారు. పార్వతీపురం మున్సిపల్ పాఠశాలలలో గురువారం నిర్వహించిన జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవంలో ఆయన మాట్లాడారు. 1–19 సంవత్సరాల వయస్సు వారు ఆల్బెండజోల్ మాత్రను విధిగా వేసుకోవాలన్నారు. ఆ రోజు పాఠశాలలకు రాని విద్యార్థులకు కూడా మాత్రలు అందజేయాలని వైద్యసిబ్బందికి సూచించారు. నులిపురుగుల వల్ల రక్తహీనత, పోషకాల లోపం, ఆకలి మందగించడం, కడుపునొప్పి, వికారం, వాంతులు, విరేచనాలు, బరువుతగ్గడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ బి.జగన్నాథరావు, డాక్టర్ ధవళ భాస్కర్, డాక్టర్ విజయమోహన్, పి.లావణ్య, వై.యోగేశ్వరరెడ్డి, పీపీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గడపగడపకూ పనులకు రూ.11 కోట్లు

- ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ రాజన్

బొబ్బిలి: గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యేలు గ్రామాల్లో గుర్తించిన సమస్యల పరిష్కారానికి రూ.11 కోట్లు మంజూరైనట్టు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ పీఏఎస్ రాజన్ తెలిపారు. బొబ్బిలిలో ఆయన విలేకర్లతో గురువారం మాట్లాడారు. ఈ నిధులతో జిల్లా వ్యాప్తంగా 1,110 పనులు చేపడతామని చెప్పారు. ఇందులో 115 పనులు ప్రారంభం కాగా 52 పనులు ఇప్పటికే పూర్తయ్యాయన్నారు. జల్‌జీవన్ మిషన్ పథకంలో ఇప్పటివరకూ జిల్లా వ్యాప్తంగా రూ.631 కోట్లతో గ్రామాల్లో ఇంటింటికీ తాగునీరు కల్పించామని చెప్పారు. సెకెండ్ ఫేజ్‌లో రూ.702 కోట్లతో 1300 పనులు చేపడతామని వివరించారు.

క్లుప్తంగా

వృద్ధుడి అదృశ్యం



అదృశ్యమైన కూర్మినాయుడు

వంగర: మండల పరిధి సంగాం గ్రామానికి చెందిన వృద్ధుడు శనపతి కూర్మినాయుడు అదృశ్యంపై కేసు నమోదుచేశామని ఎస్సై ఆర్.జనార్దన రావు గురువారం తెలిపారు. ఈ నెల 1 నుంచి కూర్మినాయుడు కనబడడంలేదని కుమారుడు రాము ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

హోంగార్డుకు చేయూత



హోంగార్డు గంగారావుకు చెక్కును అందజేస్తున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీసు శాఖలో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన హోంగార్డు ఎస్.గంగారావుకు చేయూతగా సహచర హోంగార్డులు ఒక్కరోజు జీతం అలవెన్స్ రూ.3 లక్షల 23వేల 760 వితరణగా ఇచ్చారు. ఈ మేరకు ఎస్పీ ఎం.దీపిక చేతుల మీదుగా గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ ఎల్.శేషాద్రి, ఆర్ఐ ఎస్.గోపాలనాయుడు, ఆఫీస్ సూపరింటెండెంట్ ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

ల్యాబ్‌టెక్నీషియన్లుగా ఇద్దరికి రీపోస్టింగ్ ఆర్డర్స్

విజయనగరం ఫోర్ట్: ఇద్దరు ల్యాబ్‌టెక్నీషియన్లకు వైద్యారోగ్యశాఖ అధికారులు గురువారం రీ పోస్టింగ్ ఆర్డర్స్ ఇచ్చారు. సంతోష్, ప్రకాష్‌లు రెండేళ్ల క్రితం ల్యాబ్ టెక్నీషియన్లుగా విధుల్లో చేరారు. అయితే వారు విధుల్లో చేరినప్పుడు ఇచ్చిన ధ్రువీకరణ పత్రాల్లో ట్యాంపరింగ్ జరిగినట్లు ఆరోపణలు రావడంతో విధుల నుంచి తొలగించారు. దీంతో వారిద్దరూ తమకు ఎటువంటి నోటీస్ ఇవ్వకుండా తొలగించారని హైకోర్టును ఆశ్రయించారు. నిబంధనలు పాటించకుండా విధుల నుంచి తొలగించారు కాబట్టి తిరిగి విధుల్లో చేర్చుకోవాలని కోర్టు ఆదేశాలు ఇచ్చింది. దీంతో వారిద్దరికీ రీపోస్టింగ్ ఆర్డర్లు ఇచ్చారు.

ముద్దాయికి మూడు నెలల జైలు శిక్ష

దీపురువల్లి: పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మూడేళ్ల క్రితం జరిగిన చోరీ కేసులో ముద్దాయికి మూడు నెలల జైలుశిక్ష పడినట్లు ఎస్సై ఎ.సన్యాశినాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2020 జనవరి 2న స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగిన చోరీకి సంబంధించి అప్పటి సబ్ రిజిస్ట్రార్ బీజీఎస్‌వీ ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కేసు విచారణ అనంతరం గుర్ల మండలంలోని చింతలపేటకు చెందిన యడ్ల రామచంద్రను ముద్దాయిగా నిర్ధారించి మూడు నెలల జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి ఎం.విజయ రామేశ్వరి తీర్పునిచ్చినట్లు తెలిపారు.

కత్తెర పురుగుపై అప్రమత్తం



బూరాడపేటలో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

నెల్లిమర్ల రూరల్: మొక్కజొన్నను ఆశిస్తున్న కత్తెరపురుగు పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ లక్ష్మణరావు, డాక్టర్ స్వాతి సూచించారు. మండలంలోని బూరాడపేటలో మొక్కజొన్న పంటలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మొక్కజొన్న పంటకు ఆశిస్తున్న కత్తెర పురుగును గుర్తించి పలు సూచనలు అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ, కత్తెర పురుగు నివారణపై రైతులు పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకోవాలన్నారు. లోతు దుక్కులు చేయడం వల్ల పురుగు కోశస్థ దశలు నాశనమవుతాయన్నారు. పురుగు ఉనికిని రైతులు ఎప్పటికప్పుడు గమనిస్తూ సరైన యాజమాన్య పద్ధతులను అనుసరిస్తే నష్టాన్ని నివారించుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఏఓ పూర్ణిమ, రైతులు పాల్గొన్నారు.

చెప్పడానికి ఏమీలేక..!

- అబద్ధపు ప్రచారాలు..రెచ్చగొట్టే ప్రసంగాలు
- ఇదే మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వాకం
- జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు



మీడియాతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం: 14 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా..ప్రతిపక్ష నేతగా పని చేశానని రాజకీయంగా గొప్పలు చెప్పుకునే టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఉమ్మడి విజయనగరం జిల్లాకు ఆయన హయాంలో చేసింది చెప్పుకునేందుకు లేకపోవడంతో అబద్ధపు ప్రచారాలు..ప్రజలను రెచ్చగొట్టే ప్రసంగాలు చేశారని విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. ఈ మేరకు గురువారం సాయంత్రం జెడ్పీ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షనేతగా ప్రాజెక్టుల పరిశీలన పేరిట విజయనగరం, పార్వతీపురం-మన్యం జిల్లాల్లో పర్యటించిన చంద్రబాబు తన స్వార్థ బుద్ధితో వాస్తవాలను వక్రీకరిస్తూ ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నిస్తూ ఎప్పటిలాగానే యాత్రను కొనసాగించారని ఎద్దేవా చేశారు. ఎన్ఎస్‌జీ భద్రత ఉన్న చంద్రబాబు తనపై హత్యాయత్నం చేశారంటూ చెప్పుకుంటున్నారని, అసలు పుంగనూరులో ఏం జరిగిందో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసన్నారు. చట్టానికి ఎవ్వరూ అతీతులు కాదన్న విషయాన్ని గ్రహించాలని హితవు పలికారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించిన తోటపల్లి ప్రాజెక్టును పరిశీలించిన అనంతరం నిర్వహించిన బహిరంగలో తోటపల్లి ప్రాజెక్టుకు తానే శంకుస్థాపన చేసి పూర్తి చేశానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. 2004వ సంవత్సరంలో జరిగిన సాధారణ ఎన్నికలకు కొద్ది రోజుల ముందు పది ఇటుకలు, ఒక శంకుస్థాపన ఫలకం ఏర్పాటు చేయడం తప్ప తోటపల్లి ప్రాజెక్టుకు ఏం చేశారో చంద్రబాబు చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం అధికారంలోకి వచ్చిన మహానేత దివంగత డాక్టర్ వైఎస్సార్ తలపెట్టిన జలయజ్ఞం కార్యక్రమంలో భాగంగా 2004-2014 సంవత్సరాల మధ్య అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జిల్లా మంత్రి బొత్స సత్యనారాయణ సారథ్యంలో ఉమ్మడి జిల్లాలోని 1.80 లక్షల ఎకరాల సాగుభూమికి నీరందించాలనే సంకల్పంతో రూ.500 కోట్ల నిధులు కేటాయించి 90 శాతం పనులు పూర్తి చేసిన విషయం టీడీపీ నేతలు, చంద్రబాబుకు తెలియదా అని ప్రశ్నించారు.

ఇక్కడి ప్రజలను ఇంకేం మోసం చేస్తారు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే ఉత్తరాంధ్రలో అత్యంత వెనుకబడిన పార్వతీపురం-మన్యం జిల్లాకు మేలు జరిగిందన్న విషయాన్ని గట్టిగా చెప్పగలమని, టీడీపీ హయాంలో ఏం చేశారని మజ్జి శ్రీనివాసరావు మండిపడ్డారు. ఇక్కడి ప్రజలను ఇంకెంత మోసం చేస్తారని ప్రశ్నించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా ఉన్నపుడే పార్వతీపురాన్ని ప్రత్యేక జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ ఉంటే కనీసం పట్టించుకోలేదని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో ప్రత్యేక జిల్లాగా ప్రకటించడాన్ని ఎందుకు స్వాగతించలేకపోయారని ప్రశ్నించారు.

ఎస్సీ, ఎస్టీ ప్రజాప్రతినిధులపై మీ ప్రతాపమా..?

14 ఏళ్ల రాజకీయ ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబు అతి చిన్న వయస్సులో డిప్యూటీ సీఎంగా బాధ్యతలు నిర్వహించిన ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావులపై అర్థరహిత ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇదేనా చంద్రబాబు సీనియార్టీ అంటూ మండిపడ్డారు. సమావేశంలో వద్రి నర్సింహమూర్తి, వైఎస్సార్‌సీపీ గుర్ల మండల అధ్యక్షుడు స్వామినాయుడులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో మారణహోమం నిరసిస్తూ శాంతి ర్యాలీ



అంబేడ్కర్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న మహమ్మద్ నాజిర్

విజయనగరం టౌన్: మణిపూర్‌లో మారణహోమాన్ని నిరసిస్తూ ఎస్సీ, ఎస్టీ, క్రిస్టియన్, ముస్లిం మైనార్టీల ఫోరం ఆధ్వర్యంలో గురువారం విజయనగరం పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మహమ్మద్ నాజిర్ ఆధ్వర్యంలో క్రైస్తవులు, దళిత సంఘాల నాయకులు, ముస్లింలు ర్యాలీలో పాల్గొని మణిపూర్ రాష్ట్రంలో క్రైస్తవులపై జరుగుతున్న హింసను ఖండించారు. ఈ సందర్భంగా స్థానిక కలెక్టరేట్ వద్దనున్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతదేశంలో జంతువులకు ఉన్న విలువ మనుషులకు లేదన్నారు. ముఖ్యంగా మైనార్టీలైన ముస్లింలు, క్రైస్తవులు, బడుగు బలహీన వర్గాలకు లేకపోవడం బాధాకరమన్నారు. ఆలిండియా క్రిస్టియన్ కౌన్సిల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ బి.ఉదయ చంద్ర మాట్లాడుతూ డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ కల్పించిన రాజ్యాంగ హక్కులను కాపాడాల్సిన వారే ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్నారన్నారు. ఈ విషయంలో రాష్ట్రపతి ముర్ము వెంటనే జోక్యం చేసుకుని కేంద్రప్రభుత్వం ద్వారా మణిపూర్ రాష్ట్రంలో శాంతిభద్రతలు నెలకొల్పాలని కోరారు. నేటికీ మూడు నెలలు పైబడినప్పటికీ ప్రధాని ఆ రాష్ట్రాన్ని సందర్శించకపోవడం చాలా బాధాకరమన్నారు. ముస్లిం మైనారిటీ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ అమీద్ మాట్లాడుతూ మణిపూర్‌లో జరుగుతున్న హింసను వెంటనే నిలిపివేసి, హింసకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ర్యాలీ అనంతరం కలెక్టర్‌ను కలిసి మెమొరాండం సమర్పించారు. కార్యక్రమంలో యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు ఎస్.మధు, ఆలిండియన్ క్రిస్టియన్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పి.ప్రేమానందం, బిషప్ ఎం.పాల్సన్,వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షురాలు ఆశాజాన్ డి.ఎలీషా, ఎల్.మధుసూదన్, పీఎస్.ప్రసాద్, పిల్లా ఆనందబాబు, బలరామ్ పాల్, జయప్రకాశ్, సత్యరాజ్, యబ్బోజు చౌదరి, ఆనంద్, మస్తాన్, వి.భూషణం, దళిత సంఘం నేతలు ఆదాడ మోహనరావు, సుహాసిని, పవన్, తదితరులు పాల్గొన్నారు.

మూడు పశువుల వ్యాన్‌ల పట్టివేత



వ్యాన్‌లో పరిమితికి మించి తరలిస్తున్న ఆవులు

రాజాం సిటీ: మండల పరిధి పొగిరి సమీపంలో రాజాం నుంచి అక్రమంగా పశువులను తరలిస్తున్న మూడు వ్యాన్‌లను ఉత్తరాంధ్ర సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి అడ్డుకున్నారు. గురువారం రాజాంలో జరిగిన వారపు సంతలో పశువులను కొనుగోలు చేసి తరలిస్తుండగా అడ్డుకుని పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వ్యాన్‌లతో సహా పశువులను స్టేషన్‌కు తరలించారు. అక్రమంగా పరిమితికి మించి తరలించడం నేరమని, ఒక్కో వ్యాన్‌లో ఆరు పశువులకు మించి తరలించరాదన్నారు. అయినప్పటికీ మూడు వ్యాన్‌లలో 38 పశువులను తరలించడంతో పశువుల అక్రమ రవాణా చట్టం కింద పశువులు తరలిస్తున్న వ్యక్తులపై కేసు నమోదుచేసినట్లు సీఐ కె.రవికుమార్ తెలిపారు. అనంతరం పశువులకు వైద్యపరీక్షలు చేశామని, వాటిని కోర్టులో హాజరుపరచి, కోర్టు అనుమతితో పశువులను విడిచిపెట్టనున్నామని చెప్పారు.

డోర్ టు డోర్ సర్వే



వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: జిల్లాలో ఓటరు లిస్టు వెరిఫికేషన్, ఇంటింటి ఓటరు సర్వే కార్యక్రమం నిబంధనల మేరకు జరుగుతున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ మీనా ఇంటింటి ఓటరు సర్వేపై కలెక్టర్‌లు, జాయింట్ కలెక్టర్‌లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇంటింటి సర్వే వివరాలను తెలియజేస్తూ జిల్లాలో 2,74,327 డోర్ నంబర్‌లు ఉన్నాయని, వాటిలో 1,38,055 డోర్ నంబర్‌లను బీఎల్‌ఓలు వ్యక్తిగతంగా పరిశీలించారని, 2245 డోర్ నంబర్‌లు బీఎల్‌ఓ యాప్‌లో వెరిఫికేషన్ పూర్తయినట్లు తెలిపారు. జిల్లాలో 18 ఏళ్లు నిండినవారు 4072మంది ఉండగా 4,020మంది నుంచి ఓటరు నమోదుకు దరఖాస్తులను స్వీకరించినట్లు చెప్పారు. రాజకీయ పార్టీలతో ఇంతవరకు రెండుసార్లు సమావేశాలను నిర్వహించినట్లు తెలిపారు. ఒకే డోర్ నంబర్‌లో 10 కంటే ఎక్కువ మంది ఓట్లు ఉన్న వారి వివరాలు, 100 ఏళ్లు దాటిన వారి వివరాలను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జేసీ ఆర్.గోవిందరావు, సూపరింటెండెంట్ డి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్టోన్ ప్లాంటేషన్ పనులు వెంటనే పూర్తిచేయాలి

భూ రీసర్వే పూర్తయిన గ్రామాల్లో స్టోన్ ప్లాంటేషన్ వెంటనే పూర్తిచేయాలని సర్వే అండ్ సెటిల్‌మెంట్ కమిషనర్ సిద్ధార్థ జైన్ సూచించారు. ఈ మేరకు గురువారం కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్‌లతో రీసర్వేపై వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. కార్యక్రమంలో కలెక్టర్ నిషాంత్‌కుమార్ మాట్లాడుతూ ఆర్ఓఆర్ పూర్తయిన గ్రామాలలో స్టోన్ ప్లాంటేషన్ పూర్తిచేసినట్లు తెలిపారు. జిల్లాలో నిర్ణీత షెడ్యూల్ ప్రకారం రీసర్వే పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఈ-కేవైసీ సకాలంలో పూర్తిచేస్తామని, ప్రభుత్వ భూములు, రోడ్లు గుర్తించి హద్దులు నిర్ణయిస్తున్నట్లు తెలిపారు.

ఆస్పత్రి ప్రసవాలను ప్రోత్సహించాలి

పార్వతీపురం: ప్రభుత్వ ఆస్పత్రులలో ప్రసవాలను ప్రోత్సహించి, సాధారణ ప్రసవాలను పెంచాలని రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్.జవహర్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో ఆరోగ్యశాఖ, శిశు సంక్షేమశాఖ, విద్యాశాఖలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆస్పత్రులకు లక్ష్యాలు నిర్దేశించాలని సూచించారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా గ్రామాలలో సర్వే నిర్వహించి, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు చర్యలను సిఫార్సు చేయాలని సూచించారు. గడప గడపకు మంజూరైన పనులను త్వరితగతిన పూర్తిచేయాలని స్పష్టం చేశారు. నాడు-నేడు పనులను త్వరితగతిన పూర్తిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ నిషాంత్‌కుమార్, డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథ రావు, డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్, డీఈఓ ఎస్.ప్రేమ్ కుమార్ తదితరులున్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు

విజయనగరం అర్బన్: పట్టణంలోని మహారాజా ఫార్మసీ కళాశాలలో ఈ నెల 4వ తేదీ నుంచి జరుగుతున్న 'మహిళా ఆత్మరక్షణ' అవగాహన శిక్షణ తరగతులు గురువారంతో ముగిశాయి. కళాశాల మహిళా సాధికార లింగ సున్నితత్వం కమిటీ సమన్వయకర్త కె.మాధవి, జిల్లా క్రీడా సాధికార సంస్థ కోచ్ ఎస్.రవి సంయుక్త పర్యవేక్షణలో విద్యార్థినులకు మార్షల్ ఆర్ట్‌లో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉదయ్‌శంకర్ మాట్లాడుతూ, ఆత్మస్థైర్యాన్ని కలిగించే క్రీడలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలనే లక్ష్యంతో శిక్షణ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

రైలు కిందపడి ఆటోడ్రైవర్ మృతి



సంఘటనాస్థలంలో క్షతగాత్రులకు సపర్యలు చేస్తున్న 108 సిబ్బంది

బొబ్బిలి: రామభద్రపురం మండల కేంద్రానికి చెందిన గొర్లె చిన్నారావు(30)అనే ఆటో డ్రైవర్ రైలు కిందపడి మృతి చెందినట్లు రైల్వే హెచ్‌సీ ఎస్. కృష్ణారావు తెలిపారు. బొబ్బిలి-డొంకినవలస స్టేషన్ల మధ్య బహిర్భూమికి వెళ్లి పట్టాలు దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొందని చెప్పారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలున్నారు. మృత దేహానికి సీహెచ్‌సీలో పోస్టుమార్టం చేయించి కుటుంబసభ్యులకు అప్పగించినట్లు చెప్పారు.

లారీ ఢీకొని ఇద్దరికి గాయాలు

- చికిత్స పొందుతూ ఒకరి మృతి

సీతానగరం: మండలంలోని రాష్ట్రరహదారిలో గుచ్చిమివద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయాలపాలయ్యారు. వారిలో ఒకరు చికిత్స పొందుతూ మృతిచెందారు. వివరాలిలా ఉన్నాయి. బొబ్బిలి పట్టణానికి చెందిన పాట్నూరు దినేష్., భార్య అముల్య పార్వతీపురంలో బంధువుల ఇంటికి వెళ్లారు. గురువారం సీతానగరంలోని లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో పూజల కోసం పార్వతీపురం నుంచి బైక్‌పై వస్తుండగా గుచ్చిమి వచ్చేసరికి ఫోన్ వచ్చిందని రోడ్డు పక్కన ఆగి అముల్య మాట్లాడుతుండగా వెనుకనుంచి వస్తున్న లారీ ఢీకొట్టడంతో భార్యాభర్తలకు బలమైన గాయాలయ్యాయి. దీంతో 108 సిబ్బంది వచ్చి సపర్యలు చేసి చికిత్స నిమిత్తం పార్వతీపురం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. అముల్య చికిత్స పొందుతుండగా మృతి చెందింది. దినేష్ కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీతానగరం ఎస్సై తెలియజేశారు.

న్యాయం కావాలి

- పోలీస్‌స్టేషన్‌లో మహిళ భైఠాయింపు
- బాధితురాలికి సీపీఎం నాయకుడి మద్దతు



పోలీస్‌స్టేషన్‌లో మెట్లపై భైఠాయించిన బాధిత మహిళ రాజ్యలక్ష్మి, సీపీఎం నాయకుడు జగన్

వేపాడ: భర్త వల్ల మోసపోయాయని తనకు న్యాయం చేయాలంటూ వేపాడ మండలంలోని అతవ గ్రామానికి చెందిన చప్ప రాజ్యలక్ష్మి వల్లంపూడి పోలీస్‌స్టేషన్‌లో భైఠాయించింది. ఈ మేరకు సీపీఎం నాయకుడు చల్లాజగన్‌తో పాటు బంధువు మద్దతుతో స్టేషన్‌కు వచ్చింది. ఇందుకు సంబంధించి బాధితురాలు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సాలూరు మండలం దేవీబుచ్చంపేట గ్రామానికిచెందిన రాజ్యలక్ష్మికి పెద్దల సమక్షంలో 2023 మార్చి26న వేపాడ మండలం అతవ గ్రామానికి చెందిన చప్పకృష్ణతో సింహాచలంలో వివాహం జరిగింది. వివాహం అనంతరం కొన్ని రోజులు బాగానే ఉన్నారు. తర్వాత గొడవలు ప్రారంభమయ్యాయి. ఆమె ప్రస్తుతం గర్భిణి కావడంతో అబార్షన్ చేసుకోమని భర్త బలవంతం పెడుతున్నాడు. తాను అబార్షన్ చేయించుకోనని బిడ్డ ముఖ్యమని రాజేశ్వరి చెప్పడంతో అప్పటి నుంచి అత్తవారింట్లో గొడవలు ప్రారంభమయ్యాయి. అత్తవారింటిలో పెట్టిన ఇబ్బందులు తట్టుకోలేక ఆమె తల్లికి ఫోన్‌చేసి జూన్ ఐదున పుట్టింటికి వెళ్లిపోయింది. భర్త వ్యవహారంపై సాలూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఆగస్టు 7న ఫిర్యాదు చేసింది. ఈ విషయం తెలుసుకున్న భర్త వల్లంపూడి పోలీసులకు భార్య రాజేశ్వరిపైఫిర్యాదు చేయడంతో పోలీసుల సమాచారం మేరకు వల్లంపూడి స్టేషన్‌కు ఆమె వచ్చి వాస్తవ విషయాలను పోలీసులకు వివరించింది. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు చల్లా జగన్ మాట్లాడుతూ బాధిత మహిళకు న్యాయం జరిగేవరకు తమమద్దతు అందిస్తామన్నారు. మహిళా చట్టాలు ఎన్ని ఉన్నా నేటికీ మహిళలు మోసపోతున్నారని బాధిత మహిళ రాజేశ్వరికి తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

రేషన్ బియ్యం పట్టివేత



పల్లె వీధిలో పట్టుకున్న బియ్యం బస్తాల వద్ద విజిలెన్స్, సీఎస్‌డీటీ సిబ్బంది

బొబ్బిలి: పట్టణంలోని పల్లె వీధిలో బియ్యం వ్యాపారి చీపురుపల్లి నర్సింగరావు ఇంట్లో 1600 కిలోల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు సీఎస్‌డీటీ ఆర్.సాయికృష్ణ తెలిపారు. విజిలెన్స్ ఎస్సై రామారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దాడుల్లో స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని కస్టోడియన్‌కు అప్పగించారు. అలాగే మండలంలోని దేవుపల్లిలో బోగెర్ల శంకర రావు ఇంట్లో బియ్యం నిల్వలపై దాడులు నిర్వహించి 24 బస్తాల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ సీఐ బి.సింహాచలం, సీఎస్‌డీటీ సాయికృష్ణ తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి నిందితులపై 6ఎ కేసులు నమోదు చేశారు.

పురుగు మందుల వాడకం తగ్గించాలి

వంగర: పంట పొలాల్లో రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకం తగ్గించాలని ఏవో తట్టికోట కన్నబాబు సూచించారు. మండల పరిధి మద్దువలస గ్రామంలో పొలంబడి కార్యక్రమం గురువారం నిర్వహించారు. రసాయన ఎరువుల వాడకం వలన రైతులకు కలిగే అనర్థాలు వివరించారు. ఖరీఫ్‌లో భాగంగా వరి సాగులో పద్ధతులను రైతులకు వివరించారు. కార్యక్రమంలో వీఏఏ పద్మజ, రైతులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

సంతకవిటి: మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) 50వ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీయూటీఎఫ్ జెండాను మండల అధ్యక్షుడు దోల కృష్ణారావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శానపు బాబూరావు, కె.శ్రీనివాసరావు, ఎ.వెంకటప్పలనాయుడు, ఎమ్.శ్రీనివాసరావు, పి.నాగేశ్వరరావు, బి.రాజారావు తదితరులు పాల్గొన్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,380-00
బంగారం(22సి. 10గ్రా.)	55,350-00
వెండి (కిలో)	80,000-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹115	₹200	₹ 210

అభివృద్ధి పనులు వేగవంతం

- నగర పంచాయతీ కమిషనర్ బాలాజీ ప్రసాద్




అభివృద్ధి పనులపై సిబ్బందితో చర్చిస్తున్న కమిషనర్ బాలాజీ ప్రసాద్

నెల్లిమర్ల రూరల్: నగర పంచాయతీ పరిధిలోని పలు వార్డుల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కమిషనర్ బాలాజీ ప్రసాద్ సూచించారు. గురువారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పట్టణ పరిధిలోని పలు వార్డుల్లో సీసీ రహదారులు, డ్రైన్ల నిర్మాణాలకు ఇప్పటికే శంకుస్థాపనలు పూర్తయ్యాయని, నాణ్యత ప్రమాణాలు పాటించి అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. పనులను సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. జగనన్న కాలనీ లబ్ధిదారులు త్వరగా నిర్మాణాలు పూర్తి చేసేలా చైతన్య పరచాలని తెలిపారు. కార్యక్రమంలో వార్డు కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించాలి

- జూనియర్ ఫెన్సింగ్ పోటీలకు జిల్లా జట్టు సిద్ధం



రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

విజయనగరం:

రాష్ట్ర స్థాయిలో జరగనున్న ఫెన్సింగ్ పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న క్రీడాకారులు ఉత్తమ ప్రతిభాపాటవాలతో రాణించాలని సెట్విజ్ సీఈఓ బి.రామ్‌గోపాల్ ఆకాంక్షించారు. విజయనగరం విజ్జీ స్టేడియం ప్రాంగణంలో జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్స్ విభాగంలో బాల, బాలికలకు గురువారం ఎంపిక పోటీలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 40 మంది క్రీడాకారులు హాజరుకాగా.. వారిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో ఈ నెల 12, 13 తేదీల్లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులను సెట్విజ్ సీఈఓ అభినందిస్తూ విజేతలుగా రావాలని సూచించారు. పోటీలను అసోసియేషన్ అధ్యక్షుడు డి.వి.చారిప్రసాద్, కె.కావ్య, కె.చిట్టిబాబు పర్యవేక్షించారు.